క్లుప్తంగా

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ఉపాధ్యాయుల లక్ష్యమని ఎంఈఓ ఉయ్యూరి వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూలు కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రెండు సార్లు స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజారత్నం, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, అనంతరామశర్మ, చక్రపాణి, అమర్‌నాథ్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి



వేమూరు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.బి. విలియం సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో పంచాయతీ రాజ్, గృహ నిర్మాణం, గ్రామ సచివాలయం ఇంజినీరు అసిస్టెంట్‌లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో తహసీల్దారు సుశీల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు భట్టిప్రోలులో పంచాయతీ సర్వసభ్య సమావేశం

సాక్షి ఎఫెక్ట్

భట్టిప్రోలు: చిత్రం.. భళారే విచిత్రం శీర్షికన లేని ట్రాక్టర్లకు భట్టిప్రోలు పంచాయతీకి నోటీసులు రావడంపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి పాలకవర్గం స్పందించింది. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ సర్పంచ్ దారా రవి కిరణ్మయి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు అత్యవసర పాలక వర్గ సర్వ సభ్య సమావేశం నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. ఎస్సీ కార్పొరేషన్ నుంచి భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి వచ్చిన నోటీసులపై సమావేశంలో చర్చ జరగనుంది.

ఎస్‌ఐగా శివయ్య బాధ్యతల స్వీకారం



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎస్‌ఐగా ఎం.శివయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొరిశపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ కాసుల శ్రీనివాసరావు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. శివయ్యకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

పారిశుద్ధ్య సిబ్బందికి చీరలు పంపిణీ



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన పసుపులేటి వారి కుటుంబ సభ్యులు పారిశుద్ధ్య సిబ్బందికి సోమవారం చీరలు పంపిణీ చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పసుపులేటి శివరామ ప్రసాద్‌కు పారిశుద్ధ్య కార్మికులు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు తీసుకున్నారు. పసుపులేటి భాస్కరరావు, శివరామ ప్రసాద్, ధర్మ, ఆంజనేయులు సోదరులు 20 మంది కార్మికులకు చీరలు అందచేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సరికాదు

దళిత ప్రజా సంఘాలు



బాపట్ల: ఎస్సీ వర్గీకరణ సరికాదని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక పేర్కొంది. ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దళితులను విడదీయొద్దని కోరారు. దీక్షలో కాగిత కోటేశ్వరరావు, డాక్టరు చార్వాక, జి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ కోలాహలం



ఎంవీరాజుపాలెంలో పారిశుద్ధ్య కార్మికులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

కర్లపాలెం/పిట్టలవానిపాలెం/రేపల్లె రూరల్/భట్టిప్రోలు: బాపట్ల నియోజకవర్గంలో ప్రజలు రాఖీ పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. కర్లపాలెం మండలం ఎంవీరాజు పాలెం గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాఖీ పౌర్ణమిని ఐటీసీ సెర్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు పారిశుద్ధ్య కార్మికులకు రాఖీ కట్టారు. సెర్ఫ్ సంస్థ కో–ఆర్డినేటర్ అరుణ్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం కోసం ఈ వేడుక నిర్వహించినట్టు వెల్లడించారు. సమాజానికి పారిశుద్ధ్య కార్మికులు చేసే సేవల గురించి విద్యార్థులకు వివరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏపీసీ నారాయణ, సుమంత్, పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు. భట్టిప్రోలులోనూ రాఖీ వేడుకలు జరిగాయి.

సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో,..

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేపల్లె ఒకటో వార్డు రామాలయంలో రాఖీ పూర్ణిమ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, సభ్యులు జంగం శ్యాంప్రసాద్, మోపిదేవి శ్రీనివాసరావు, పేరం కోటేశ్వరరావు, కాశేపల్లి గౌరీశంకర్, శాంతి బాబురావు, చింతల మురళీకృష్ణ, అక్కల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఖాజీపాలెం కోదండ రామాలయంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్ష బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల సహ కన్వీనర్ శివనారాయణ, రామాలయం ప్రధాన అర్చకులు అనంతశ్రీనివాసచక్రవర్తి, ధర్మ ప్రచారక్ అక్కల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భవిత స్కూలులో..

వైకల్యం శరీరానికేగానీ మనసుకు కాదని, వైకల్యాన్ని జయించి ఉన్నతశిఖరాలు అధిరోహించిన వారెందరో ఉన్నారని ఎంఈవో రత్న శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో భవిత స్కూలులో సోమవారం నిర్వహించిన రాఖీ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల భవితకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు రాఖీలు కట్టి పండ్లు, స్వీట్లు, బిస్కెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ, ఆదర్శవేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు, సభ్యులు నటరాజ్, కే.వెంకటేశ్వర్లు, కే.రాంబాబు, సాంబశివరావు, ఎస్.రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె భవిత స్కూలులో విద్యార్థికి రాఖీ కడుతున్న స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ



ఖాజీపాలెం కోదండ రామాలయంలో రాఖీ వేడుక



ఎంవీరాజుపాలెంలో పారిశుద్ధ్య కార్మికునికి రాఖీ

వైభవంగా విఖనస జయంత్యుత్సవం

బాపట్ల: భావపురి భావదేవుని సన్నిధిలో విఖనస జయంత్యుత్సవాన్ని సోమవారం నిర్వహించారు. క్షీర భావనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. విఖనస జయంతి సందర్భంగా ఆచార్య స్వామికి ఉదయాన్నే స్నపన తిరుమంజనం, విశేష అర్చనలు, గ్రామోత్సవం, గోష్ఠి నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదారు నల్లూరి మోహన రంగాచార్యులు, నారాయణం శ్రీనివాసమూర్తి, నారాయణం అప్పలాచర్యులు , బృందావనం శ్రీనివాస ఆచార్యులు, పెద్దింటి లక్ష్మి నారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నల్లూరి పాంచజన్య చార్యులు, విఖానస మూర్తి, శేషబాబు,సత్యంబాబు, దీవి రాము, పరాసరం శ్రీనివాస్ రామ భార్గవ, కృష్ణ భార్గవ పాల్గొన్నారు.



క్షీర భావనారాయణస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

గోవాడలో..

వేమూరు(అమర్తలూరు) అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో విఖసన జయంత్యుత్సవం సోమవారం నిర్వహించారు. విఖసన స్వామికి పంచామృత అభిషేకం, అర్చన, గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించారు. వక్తలు ప్రసంగించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షరాలు పరాశరం రంగవలి, అగమ పండితులు పరాశరం రామచార్యులను సత్కరించారు.



గోవాడలో జయంత్యుత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎరువుల నమూనాల సేకరణ

పెరవలి పాలెం(వేమూరు) : కల్తీ, నకిలీ ఎరువుల గుర్తింపునకు నమూనాలను సేకరించామని మండల వ్యవసాయాధికారి(ఏఓ) సి.హెచ్.సునీత తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలిపాలెం గ్రామంలోని లక్ష్మీ శ్రీనివాస సీడ్స్ షాపులో ఎరువుల స్టాక్ నమూనాలను తీసి నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవడానికి పరీక్ష కేంద్రానికి పంపించామని వెల్లడించారు. ఏఓ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా ఎరువులు అమ్ముతున్న డీలర్లపై బాపట్ల జాయింట్ కలెక్టర్ కోర్ట్‌లో 6ఏ కేసు నమోదు చేస్తామని వెల్లడించారు. ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వం అనుమతి పొంది అమ్మకాలు చేయాలని సూచించారు. నమూనాల సేకరణలో వీఆర్వో రత్న ప్రసాద్, గ్రామ వ్యవసాయాధికారులు నాగూర్ వలి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

భట్టిప్రోలులో ట్రాఫిక్ ఇక్కట్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో ట్రాఫిక్ సమస్యగా మారింది. ముఖ్యంగా స్థానిక చావలి బస్టాండ్ సెంటర్‌లో ఎదురుగా మరొక వాహనం వస్తే తప్పుకోవాలంటే కష్టతరమవుతుంది. అసలే ఇరుకు రోడ్లు ఆపై ఆక్రమణలు దీనికి తోడు రహదారికి ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేయడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య తీవ్రంగా ఉంటుంది. స్థానిక గర్డర్ బ్రిడ్జ్, స్టేట్ బ్యాంక్ వద్ద కూడా ఇదే పరిస్థితి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



భట్టిప్రోలు చావలి బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన వాహనాలు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

భట్టిప్రోలు: కోల్‌కతా మెడికల్ విద్యార్థిపై హత్యాచారాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్రదర్శనగా బయలుదేరి చావలి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ మహిళలపై దాడులను అరికట్టాలని కోరారు. నిందితులను తక్షణం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురుగుడు సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నేటి నుంచి పశువులకు టీకాలు

కొల్లిపర: నేటి నుంచి సెప్టెంబర్ 18 వరకు పశువులకు వ్యాపించే గాలికుంటు వ్యాధి నివారణకు పశు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి రైతు ఇంటి వద్దనే పశువులకు టీకాలు వేయటం జరుగుతుందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాయిసతీష్‌రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా గాలికుంటు వ్యాధి టీకాలు వేయటం జరుగుతుందన్నారు. కొల్లిపర మండలానికి 9,750 డోసుల టీకాలు వచ్చినట్లు పేర్కొన్నారు. గాలికుంటు నివారణ టీకాల కారణంగా పాడి గేదెలలో పాలు తగ్గిపోతాయనో, జ్వరం వచ్చిందనో అపోహలు వీడి రైతులు తమ పశువులకు టీకా వేయించుకోవాలని కోరారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. కొల్లిపర మండలంలో గేదెలు 11,466, ఆవులు 354 , మేకలు 1,075, గొర్రెలు 2,065 ఉన్నాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొల్లూరు : జువ్వలపాలెం సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సుధాకర్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు, పెదపులివర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జ్ ఏఈ పి.ఏడుకొండలు సోమవారం తెలిపారు. రేపల్లె–పెదపులివర్రు సబ్‌స్టేషన్‌కు వచ్చే మెయిన్ లైన్ మరమ్మతులు నిర్వహించనున్న దృష్ట్యా సరఫరాకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు.

23న గ్రామ సభలు

భట్టిప్రోలు: పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆదేశానుసారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి గాను పనులను గుర్తించేందుకు మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఈనెల 23న గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం తెలిపారు. ఈ గ్రామ సభలలో పనులను గుర్తించి తీర్మానాలు చేసి ఇవ్వాలని పేర్కొన్నారు.

21న తెనాలిలో విద్యుత్ అదాలత్

రేపల్లె రూరల్: విద్యుత్ వినియోగదారుల ఫోరం విజయవాడ ఆధ్వర్యంలో ఈనెల 21న తెనాలిలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా తమ సమస్యలను అందించాలన్నారు.

జూదరుల అరెస్ట్

వేమూరు(అమర్తలూరు) పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ అమర్ వర్ధన్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని యడవూరులోని పొలాల్లో పేకాడుతున్న వీరిని అరెస్టుచేసి రూ.77,230 స్వాధీనం చేసుకున్నామన్నారు.

చెరువులో మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి ఐతానగర్ నుంచి నేలపాడు వెళ్లే మార్గంలోని చెరువులో మృతదేహం తేలుతుండడాన్ని స్థానికులు సోమవారం గుర్తించి చెరువు యజమానికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడకు వచ్చి పరిశీలించి చెరువులో మృతదేహం పడి ఉందంటూ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించారు. అతడిని ఐతానగర్ అత్తోట వారి వీధికి చెందిన కొబ్బరి బొండాల వ్యాపారి మల్లెల బసవయ్య(55)గా గుర్తించారు. అయితే ప్రమాదవశాత్తూ చెరువులో పడ్డాడా? లేక మరేదైనా కారణమా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్ల ప్రదర్శన



బాపట్ల: బాల్య దశ నుంచి నుంచి వృద్ధాప్యం వరకు మధురస్మృతులను పదిలంగా కాపాడేది ఫొటోగ్రఫీ అని నాయకులు సుధాకర్ తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సూర్యకాశి ఫంక్షన్ హాలులో ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని ప్రగతి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నిర్వహించింది. సుధాకర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఏ విధమైన అల్బమ్స్‌ను ఇష్టపడుతున్నారో గుర్తించి వాటిని అందించేలా కృషిచేయాలన్నారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బి.ఎం.జయరావు, రమణ, ఆర్.మల్లేశ్వరరెడ్డి, కృష్ణమోహన్, ఎస్.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీఓ హెలాషారోన్



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ హెలాషారోన్

రేపల్లెరూరల్/కర్లపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీవో హెలా షారోన్ తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. మొత్తం ఐదు అర్జీలు వచ్చాయని వివరించారు.

అర్జీలు ఇవీ..

అగ్రిమెంట్ రూపేణ కొనుగోలు చేసిన ఇంటిలోకి వేరొకరు వచ్చి దౌర్జన్యంగా తనను గెంటివేశారని చెరుకుపల్లి మండలం ఆరుంబాకకు చెందిన యేమినేని వెంకటేశ్వర్లు అర్జీ అందించారు.

- పంట భూములకు సాగునీరు అందకుండా చేస్తున్నారని, తమ పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రేపల్లె పట్టణం 2వవార్డు ప్రజలు కోరారు.
- నగరం మండలం పూడివాడ రైతులు సాగునీరు విడుదల చేయాలని విన్నవించారు.
- తన పొలాలనికి హద్దు చూపించాలని అల్లపర్రు గ్రామానికి చెందిన గుత్తికొండ జయంతిబాబు కోరారు.
- పొలాలకు వెళ్లే మార్గంలో అక్రమంగా నిర్మాణాలు చేశారని, వాటిని తొలగించాలని చెరుకుపల్లి మండలం కనగాలకు చెందిన మహమ్మద్ ఖాసిం అర్జీ అందించారు.
- కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక అర్జీ అందినట్లు తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం తెలిపారు. కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామ శివారులో భవేష్ నగర్‌పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్ వేశారని ఫిర్యాదు వచ్చినట్టు వెల్లడించారు.

నివాసాల మధ్య మద్యం దుకాణాన్ని తొలగించాలి

కొల్లూరు : నివాస ప్రాంతాల మధ్య మద్యం, చికెన్ దుకాణాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మద్యం దుకాణం వల్ల నిత్యం వివాదాలు జరుగుతున్నాయని, ఆ రోడ్డున విద్యార్థినులు, మహిళలు రాకపోకలు సాగించలేకపోతున్నారని కొల్లూరు వాసులు తహసీల్దార్‌కు వివరించారు. చికెన్ దుకాణం వల్ల పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోందని చెప్పారు. అనంతవరంలో పొలం ఆన్‌లైన్ చేయాలని మరో వ్యక్తి అర్జీ ఇచ్చాడు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ వెల్లడించారు.

ఎంఈఓ సేవలకు దక్కిన అవార్డు



అవార్డు గ్రహీత ఎంఈఓ ఉయ్యూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లాలో ఉత్తమ మండల విద్యాశాఖాధికారిగా ఉయ్యూరి వెంకటేశ్వరరావు అవార్డు పొందడం అభినందనీయమని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సోమవారం అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావును ఫ్యాప్టో ఆధ్వర్యంలో సత్కరించారు. పలువురు ఉపాధ్యాయులు, మరో మండల విద్యాశాఖాధికారి రాజారత్నం మాట్లాడుతూ నిత్యం ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎంఈఓ తనవంతు కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన సేవలకు దక్కిన గౌరవమిదని పేర్కొన్నారు. అనంతరం శాలువా కప్పి పూలదండ వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరిశ నరసింహారెడ్డి, చక్రపాణి, అమర్‌నాథ్, అనంతరామశర్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



ర్యాగింగ్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అహమ్మద్‌జాని

బాపట్ల: ర్యాగింగ్ అమానుషమని సీఐ అహమ్మద్ జాని పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. సమావేశంలో మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టవ్యతిరేకమని, పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. తీవ్రతను బట్టి జీవిత కాల జైలు శిక్ష కూడా పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి మాట్లాడుతూ విద్యార్థులు చట్టానికి అనుగుణంగా నడుచుకొని కళాశాలకు గౌరవాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఐ.వి.వై.రామారావు నిర్వహించగా డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ ఎ.విజయ గోపాల్, డాక్టర్ కె.జయలలిత తదితరులు ర్యాగింగ్ దుష్పరిణామాలపై విద్యార్థులకు తెలియజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న చల్లా రామయ్య

బాపట్ల: అగ్నిప్రమాద బాధితులకు జగనన్న సైన్యం అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. కొల్లా వెంకయ్య కాలనీలోని రెండిళ్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోగా వారికి మంగళవారం రామయ్య ఆర్థిక సాయం, సరుకులు అందించారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలని కోరారు. ప్రతి కుటుంబానికి రూ.రెండు లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సద్దాం నియాజీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరు సర్పంచ్ అవినీతిపై విచారణ

జిల్లా కలెక్టర్‌ను కోరుతూ అర్జీనిచ్చిన గ్రామస్తులు



అర్జీనిచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న తోట నరేంద్ర

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరు పంచాయతీ సర్పంచ్ చొప్పర ప్రీతి నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి అర్జీని అందజేశారు. సంబంధిత నివేదికను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు అందజేస్తామని అర్జీదారుల్లో ఒకరైన తోట నరేంద్ర వెల్లడించారు. గ్రామ సర్పంచ్‌గా చొప్పర ప్రీతి ఎన్నికయ్యాక తొలిసారిగా రూ.92 లక్షల చెల్లింపు వ్యవహారంలో చెక్ పవర్‌ను కోల్పోయినట్టు గుర్తుచేశారు. 2023లో మళ్లీ రూ.98 లక్షలను నగదు రూపంలో చెల్లించి, మరోసారి చెక్ పవర్‌ను కోల్పోయారని తెలిపారు. పెద్దల సాయంతో కోర్టును ఆశ్రయించి చెక్ పవర్‌ను దక్కించుకున్నా, సర్పంచ్ వ్యవహారశైలిలో మార్పులేదన్నారు. ఎన్నికల్లో వారికి అండగా నిలిచిన వారికి, గ్రామస్తులకు ఎటువంటి మర్యాద చూపకుండా ఒంటెద్దు పోకడలతో పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు జవాబుదారీతనం లేకుండా ఉంటున్నారని చెప్పారు. ఏటా రూ.2 కోట్ల బడ్జెట్ కలిగిన కొలకలూరు పంచాయతీలో ఏ మేరకు అవినీతి జరిగిందనేది సమగ్ర విచారణలోనే తేలుతుందని స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేది తమ ఆకాంక్షగా వివరించారు.